క్లుప్తంగా

రైల్వే అధికారులతో సమీక్ష


అధికారితో మాట్లాడుతున్న ఎంపీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): స్థానిక రైల్వే సమస్యలపై ఎంపీ రఘునందన్‌రావు సోమవారం రైల్వే అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపల్ ప్రజలకు మరిన్నీ రైల్వే సేవలు అందించాలన్న లక్ష్యంతో కొద్ది రోజుల క్రితం కేంద్ర రైల్వే సహాయమంత్రి సోమన్నకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా తెల్లాపూర్ పరిధిలో నూతన రైల్వే టర్మినల్ ఏర్పాటు చేయాలని కోరినట్లు వివరించారు. తెల్లాపూర్ నుంచి విద్యుత్‌నగర్ కాలనీకు వెళ్లే మార్గంలోని అండర్ బ్రిడ్జి వద్ద పూడికతీత, అదనంగా అండర్‌బ్రిడ్జిను నిర్మించాలని చెప్పారు. త్వరలో రైల్వే అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని వివరించారు.

పంట రుణాలు వెంటనే మాఫీ చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి


మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

సంగారెడ్డి టౌన్ : రైతుల పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని, రైతు భరోసాను ఆంక్షలు లేకుండా విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్నలకు సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. వరిధాన్యం క్వింటాలుకు రూ.3500 పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఏఓ హరికృష్ణ

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సిర్గాపూర్ ఏఓ హరికృష్ణ సూచించారు. సోమవారం సిర్గాపూర్ రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, కల్యాణ్‌రావు, బస్వరాజ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ఆసనాలు వేస్తున్న వైద్యులు, సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని న్యాల్‌కల్ పీహెచ్‌సీ వైద్యులు గణపతి రావు, అమృత్ రాజ్ అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది, ప్రజలతో కలసి యోగా ఆసనాలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజూ యోగా చేసే వారు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. మనం యోగా చేయడమే కాకుండా ఇతరులు కూడా యోగా చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మార్తా, ఫార్మాసిస్టు రాంరెడ్డి, సీహెచ్‌ఓ సుదర్శన్, ఎల్‌టీ మాణయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు వైశాలి, ఈశ్వర్ రాణి, ఆనందం, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమరవాణా నిషేధించాలి


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణఖేడ్: బక్రీద్‌ను పురస్కరించుకొని నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున గోవుల అక్రమ రవాణా జరుగుతోందని శ్రీరామ్‌సేన ఆధ్వర్యంలో సోమవారం డీఎస్పీ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఖేడ్ నుంచి జహీరాబాద్‌తో పాటు పొరుగున ఉన్న కర్ణాటకలోని బీదర్ కబేళాలకు గోవులను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రజనీకాంత్, సాయిరాం, ప్రశాంత్, రవికుమార్, సుధాకర్, సతీష్ కుమార్, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.


సంగారెడ్డి జోన్: ఎస్పీకార్యాలయం ఆవరణలో..


తెల్లాపూర్ గద్దర్ విగ్రహం వద్ద..


హత్నూర: దౌల్తాబాద్ చౌరస్తాలో..

ఊరూరా సంబురం

రాష్ట్ర అవతరణ వేడుకలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాధనలో ప్రాణాలరిఎంచిన అమరులకు స్థూపం వద్ద నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రం సాధించిన 11 వసంతాలు పూర్తి చేసుకొని 12వ వసంతంలోకి అడుగుపెట్టామన్నారు. విద్య, వైద్యం తెలంగాణ అగ్రగామిగా నిలువడంతో పాటు భూభారతి, రైతు రుణమాఫీ, ప్రజాప్రభుత్వ ఆరు గ్యారెంటీలు పటిష్టంగా అమలవుతున్నాయన్నారు.


సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో..


నారాయణఖేడ్ గౌరవవందనం చేస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి


నారాయణఖేడ్: గౌరవవందనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


న్యాల్‌కల్(జహీరాబాద్): మిర్జాపూర్(బి)లోని ప్రభుత్వాసుపత్రి వద్ద ..


పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో..


పటాన్‌చెరు టౌన్: జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న నీలం మధు, నాయకులు

గెలిపిస్తే కార్మికులకు అండగా ఉంటాం

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జనక్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

జహీరాబాద్: మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలో జరగనున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే కార్మికులకు అండగా ఉంటామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జనక్‌ప్రసాద్ అన్నారు. సోమవారం కర్మాగారం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్మాగారం కార్మికులు సీఐటీయూకి వరుస విజయాలను కట్టబెట్టినా కార్మికులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. పనిభారం పెరగడంతో కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈనెల 5న జరగనున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీకి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేసి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఎస్.ఉజ్వల్‌రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ఇంటింటి ప్రచారం


ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: కార్మిక సంఘానికి జరగనున్న ఎన్నికల్లో చుక్కా రాములను గెలిపించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ మహీంద్ర అండ్ మహీంద్ర పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా మహీంద్ర టెక్నిషియన్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ.. కార్మికులకు మెరుగైన వేతనం, ఇతర సమస్యలు సీఐటీయూతోనే పరిష్కారమవుతాయని తెలిపారు. సీఐటీయూ తరపున పోటీ చేస్తున్న రాములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో సీఐటీయూ నాయకులు మహిపాల్, రాజిరెడ్డి, కనకారెడ్డి, నరేష్, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ నిర్వహించారు.

ఐఐటీ జేఈఈలో విద్యార్థిని సత్తా


సాత్విక రెడ్డి

నారాయణఖేడ్: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో నారాయణఖేడ్ మండలం హంగర్గ (బి) గ్రామానికి చెందిన సాత్వికరెడ్డి 192వ ర్యాంకు సాధించింది. గతంలో కూడా ఈ విద్యార్థిని ఎంసెట్‌లో 400 ర్యాంకు, ఐఐటీ మెయిన్స్‌లో 99.87 శాతం మార్కులు సాధించింది. అఖిల భారత స్థాయిలో సాత్వికరెడ్డి సత్తా చాటడంపై నారాయణఖేడ్ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించానన్నారు. భవిష్యత్తులో ఇంజనీరింగ్ ప్రోగ్రామింగ్‌లోనూ ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేస్తానన్నారు.

మహిళా సమాఖ్య షెడ్డు నిర్మాణానికి సాయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఇశ్రితాబాద్ గ్రామంలో మహిళా సమాఖ్య షెడ్డు నిర్మాణానికి సోమవారం కాంగ్రెస్ నాయకుడు బలరాం శ్రీనివాస్ రూ. 30వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం డ్వాక్రా గ్రూప్ మహిళలతో కలిసి షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, నాయకులు సయ్యద్ రసూల్, బాబుమియా, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా విజయభాస్కర్

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్(ఆర్‌ఎం)గా విజయభాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన ప్రభులత హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలోని స్టోర్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీ రాజు ఆధ్వర్యంలో డీఆర్‌పీలు, వీఎస్‌ఏలు పనులపై తనిఖీ చేశారు. పనుల నాణ్యత, నిధుల ఖర్చు వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు విత్తనాల కిట్ల పంపిణీ**

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఏఓ హరీశ్ పవార్ తెలిపారు. మండలంలోని 26 రెవెన్యూ గ్రామాల్లోని మూడు నుంచి ఐదు మంది అభ్యుదయ రైతులను ఎంపిక చేశామన్నారు. వారికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విత్తనాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతీ కిట్టు రూ.50లకే పంపిణీ చేస్తామన్నారు.

◆ **శివాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో శివాలయ పునర్నిర్మాణ పనులకు ఆలయ కమిటీ చైర్మన్ అల్లాని రామోజీరావు సోమవారం అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. ఆదినారాయణ స్వామి పుణ్యక్షేత్ర సమీపంలో ఎంతో విశేష్టమైన శివాలయ నిర్మాణానికి పూను కోవడంపై సంతోషం వ్యక్తం చేశారు.

◆ **ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో సోమవారం గ్రామస్తులు ఎల్లమ్మ పోచమ్మ చిత్తరమ్మ ఆలయాల్లో నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు అమ్మవార్ల విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు.

◆ **ఇంద్ర ధనస్సు కనువిందు**



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో సోమవారం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనస్సును ప్రకృతి ప్రేమికులు ఆసక్తిగా తిలకించారు. పచ్చని పొలాల మధ్య ఆకర్షణీయంగా కనిపించింది. కొంత మంది సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.

◆ **సిద్ధివినాయక ఆలయానికి పాదయాత్ర**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామశివారులో స్వంభుగా వెలసిన శ్రీసిద్ధివినాయక ఆలయంలో బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల కోఆర్డినేటర్, మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి సోమవారం పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం సాధించిన విజయాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ నుంచి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ అర్చకులు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు.

◆ **విగ్రహ ప్రతిష్ఠాపన**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీబీపేట్ తుకరాం తండాలో భవాని మాత సేవలాల్ మహరాజ్ మందిరంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మహరాష్ట్రలోని పొరదేవికు చెందిన శేఖర్ మహరాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ ఆధ్వర్యంలో శిఖర ప్రతిష్ఠ, బోనాలు, తదితర కార్యక్రమాలు చేపట్టారు. మాజీ సర్పంచ్ రాములు, తండా ప్రముఖులు మారుతి, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి భూభారతి సదస్సులు**

జిన్నారం (పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిన్నారం మండలంలో భూభారతి కార్యాచరణ షెడ్యూల్ తహసీల్దార్ దేవదాసు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే భూభారతి సదస్సుల వివరాల ప్రకారం... 3న గడ్డపోతారం, చెట్ల పోతారం అలీనగర్, 4న కొడకంచి పుట్టగూడ, 5న వావిలాల లక్ష్మీపతి గూడెం, 6న జంగంపేట. 9న కాజీపల్లి నల్తూరు కొర్లకుంట 10న ఊట్ల, సోలక్‌పల్లి 11నమంగంపేట శివానగర్, 12న కిష్టయ్యపల్లి పాలెం, 13న జగంపేట రాళ్లకత్వ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **చంద్రమౌళీశ్వరుడికి పుష్పాభిషేకం**

నారాయణఖేడ్: మండలం పరిధి వెంకటాపూర్ చౌక్ సమీపంలోని భక్తమార్కండేయ ఆలయంలో నిర్వాహకులు సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, మహాహారతి, పుష్పాభిషేకం, పుష్పార్చన, గీతాపారాయణం, లలితా సహస్రనామావళి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

◆ **నేడు రైతులకు మూల విత్తన కిట్ల పంపిణీ**

జహీరాబాద్: డివిజన్‌లోని ఆయా మండలాల్లో మంగళవారం అభ్యుదయ రైతులకు నాణ్యమైన మూలవిత్తన కిట్లను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద నిర్వహించనున్న కార్యక్రమాల్లో ఏఓ, ఏఈఓ, వ్యవసాయ విశ్వవిద్యాలయం నోడల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో విత్తన కిట్లను అందజేస్తారని పేర్కొన్నారు. నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమం కింద ఎంజీజీ-295 అనే పెసరరకం 200 విత్తన కిట్లను(ఒక్కో కిట్టు 3 కిలోలు) డివిజన్ పరిధిలోని న్యాల్‌కల్ మండలానికి 100 కిట్లు, ఝరాసంగం మండలానికి 80 కిట్లు, జహీరాబాద్ మండలానికి 20 కిట్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. డబ్ల్యూఆర్‌జీ-93 రకం కంది విత్తనం 285 కిట్లను అందించనున్నట్లు తెలిపారు. కోహీర్ మండలానికి 50 కిట్లు, న్యాల్‌కల్ మండలానికి 78 కిట్లు, ఝరాసంగం మండలానికి 50 కిట్లు, మొగుడంపల్లి మండలానికి 48 కిట్లు, జహీరాబాద్ మండలానికి 59 కిట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యం


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించి విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. వన మహోత్సవం 100 రోజుల ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్లే అతివృష్టి, అనావృష్టి సంభవిస్తున్నాయన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మార్పు అభివృద్ధికి మలుపు నినాదంతో అభివృద్ధికి బాటలు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్, ముంతాజ్ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు


న్యాల్‌కల్: ఇళ్ల పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ


ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న రాంరెడ్డి


నారాయణఖేడ్: ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ఎంపీపీ సౌజన్య అన్నారు. సోమవారం మండలంలోని హత్నూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. మండలానికి మొదటి విడతగా 570 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు నిర్మాణం పనులు ప్రారంభించాలని సూచించారు. ఇళ్లకు సంబంధించిన బిల్లులను కూడా సకాలంలో చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంభాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులకు ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు గృహాలను నిర్మించుకోవాలన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

వట్‌పల్లి మండలంలో..

వట్‌పల్లి(అందోల్): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూరావు అన్నారు. సోమవారం మండలంలోని మేడికుందా గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడీఓ అంజయ్య, మాజీ ఎంపీపీ పత్రి విఠల్, కో ఆప్షన్ సభ్యుడు కుత్బోద్దీన్, కాంగ్రెస్ మండల యువజన నాయకుడు ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఫత్తేపూర్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఎంపీడీఓ రమేష్‌బాబు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణానికి కోసం స్థలం పరిశీలించారు. మార్కెట్ ఇచ్చేందుకు లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్లు నిర్మించుకుంటే వెంటనే బిల్లులు చెల్లించనున్నట్లు చెప్పారు.

నాగల్‌గిద్ద మండలంలో..

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల కేంద్రంతో పాటు కిషన్‌నాయక్ తండాలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఇళ్ల మంజూరీ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లోనే పేదలందరికీ ఇండ్లు లేవనే బెంగవద్దని ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటిని నిర్మించుకునే అవకాశం ఉందన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ రంగాల వెల్డింగ్ కార్మికుల ట్రేడ్ యూనియన్ నూతన కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...కార్మిక రంగం నేపథ్యం నుంచి వచ్చిన తాను అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లోనూ అసంఘటితరంగా కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రుద్రారం పీఏసీఎస్ చైర్మన్ పాండు, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఇస్నాపూర్ మాజీ సర్పంచులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, కృష్ణ యాదవ్, గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

సేవా పతకానికి ఏఎస్‌ఐ యాదగిరి ఎంపిక


ఏఎస్‌ఐ యాదగిరి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఏఎస్‌ఐ యాదగిరి రాష్ట్ర సేవా అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇరవై ఒక్క సంవత్సరం మెదక్ జిల్లా నర్సాపూర్ సీఐ కార్యాలయంలో రైటర్‌గా సుదీర్ఘంగా విధులు నిర్వహించి అప్పట్లో ఎన్నో రివార్డులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 2015 మార్చి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 2016 సంవత్సరంలో ఎస్పీ సంగారెడ్డి జిల్లాలో పని చేసేందుకు ఎంపికై రామచంద్రాపూర్, అమీన్‌పూర్ ప్రాంతంలో పనిచేస్తూ ఎంతోమంది పోలీసు ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. 2023 సెప్టెంబర్‌లో ఏఎస్‌ఐగా పదోన్నతి పొంది ప్రస్తుతం జిన్నారం మండలంలోని బొల్లారం ప్రాంతంలో ఎస్బీ పోలీస్‌శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. యాదగిరికి సేవా పథకం అందిస్తున్నట్లు తెలియడంతో కాసాల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వేశారు.. మొరం వేయడం మరిచారు!


మొరం వేయని సీసీ రోడ్డు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిరాంనగర్ నుంచి కాంతారెడ్డి కాలనీ వరకు సీసీ రోడ్డు వేశారు. రోడ్డు అంచున మొరం మట్టి పోయడం మరిచారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. సాయిరాంనగర్ కాలనీకి రూ. 30 లక్షలు, కాంతరెడ్డి కాలనీకి రూ. 25 లక్షల స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 450 మీటర్ల సీసీ రోడ్డు వేశారు. మోటారు బైక్‌లు, కార్లు రోడ్డు కిందకు దించుతున్న సమయంలో అదుపుతప్పి పడిపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డు పక్కల మొరం మట్టి వేయించాలని కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400